ప్రజాశక్తి
మంగళవారం 7 మార్చి 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

జోరుగా అనధికార వెంచర్లు

పెరిగిన భూమార్పిళ్లు - చేతులు మారుతున్న రూ.కోట్లు
రెవెన్యూ అధికారులకు కాసుల వర్షం
చైర్మన్ నియమితులైనా కాగితాల్లోనే 'పాడా' నిర్వహణ

పల్నాడు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అనధికారిక వెంచర్లు జోరుగా వెలుస్తున్నాయి. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పిడి జోరుగా జరుగుతోంది. ఈ అంశంలో కనీస నిబంధనలు పాటించడం లేదు. నియంత్రించాల్సిన రెవెన్యూ అధికారులు మాత్రం నిర్వాహకులతో కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారులూ చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వెంచర్లకు అనుమతి ఇవ్వాల్సిన పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) నిర్వహణ ప్రేక్షకపాత్ర పోషిస్తోంది. పాడాకు చైర్మన్ మిట్టపల్లి రమేష్ ఇటీవల బాధ్యతలు స్వీకరించగా వైస్ చైర్మన్, కార్యవర్గాన్ని ఇంకా నియమించలేదు. దీంతో పాడా నుంచి అధికారులు ఎవ్వరూ లేకపోవడంతో అనధికారిక వెంచర్ల గురించి పట్టించుకునే వారే కరువయ్యారు.

నరసరావుపేటలోని సత్తెనపల్లి రోడ్డులో ఉన్న ములకలూరు వద్ద సాగర్ కాల్వపై రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పల్నాడు జిల్లాలో ఏడాది కాలంగా ఇబ్బడి ముబ్బడిగా వెంచర్లు వెలుస్తున్నాయి. కాల్వ గట్లను సైతం ఆక్రమించి రోడ్లు వేస్తున్నారు. రియల్టర్లు వ్యవసాయ భూముల్లో ప్లాట్ వేసి విక్రయిస్తుండగా వీరికి రాజకీయ అండ దండిగా ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి భూ మార్పిడి కోసం పంచాయతీ, మున్సిపాల్టీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. మొత్తం భూమి విలువలో ఐదు శాతం ఫీజును స్థానిక సంస్థలకు చెల్లించాలి. మొత్తం భూమిలో 10 శాతం కమ్యూనిటీ వినియోగం కోసం వదిలిపెట్టాలి. వాగులు, వంకలు, డొంకలు, కాల్వలు, ఇతర ప్రభుత్వ భూములు సమీపంలో ఉంటే వాటిని ఏమాత్రమూ కదిలించకూడదు. హైటెన్షన్ వైర్లు ఉన్న ప్రాంతాల్లో వెంచర్లు వేయరాదు. అంతర్గత రహదారులు 33 అడుగులు, ప్రధాన రహదారులు 40 అడుగులు ఉండాలి. ఈ నిబంధనలు పాటించకపోయినా ప్రజా ప్రతినిధుల ప్రోద్బలంతో రెవెన్యూ అధికారులు అనుమతిఇస్తున్నారు. గ్రావెల్ 2లో

ధర్నాలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి

భూమి పట్టాల కోసం ధర్నా

ప్రజాశక్తి - గురజాల

పూర్వీకుల కాలం నుండి తమ అధీనంలో ఉన్న పొలాలకు పట్టాలివ్వాలని కోరుతూ మండలంలోని చర్లగుడిపాడు దళితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. తొలుత 100 మందికి పైగా దళితులు ప్రదర్శనగా కార్యాలయానికి వచ్చి తహశీల్దార్ దానియేలుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ చర్లగుడిపాడు రెవెన్యూ పరిధిలోని 645/1ఎ, 646/ఎ, 647/ఎ,665, నుండి 687/1ఎ నంబర్లతోపాటు మరో 50 సర్వే నంబర్లలో 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కొన్ని తరలుగా దళితులు సాగు చేసుకుని బతుకుతున్నారని చెప్పారు. ఆచార్య ఎన్‌జి రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన విత్తన పరిశోధనా సంస్థకు జంగమేశ్వరపురంలో కొంత భూమి ఉందని, అయితే ఇప్పుడు దళితులు సాగు చేసుకుంటున్న భూములూ తమవేనంటూ వర్సిటీ సంస్థ బెదిరింపులు, కేసులు, వేధింపులకు పాల్పడుతోందని తెలిపారు. వీటిని తాళలేని బాధితులు హైకోర్టును ఆశ్రయించగా రైతులకు అనుకూలంగా కోర్టు తీర్పునిచ్చిందని చెప్పారు. ఇదిలా ఉండగా ఆయా సర్వే నంబర్లలోని భూములు ప్రభుత్వానికి చెందినవని సమాచార హక్కుచట్టం ద్వారా తెలిసినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆయా భూములకు సంబంధించి దళితులకు అసైన్‌మెంట్ పట్టాలు 2లో

సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్ బాబూరావు, పక్కన పాశం రామారావు, ఎం.రవి

గ్యాస్ ధర తగ్గించకుంటే ఉధృత ఆందోళన

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి-గుంటూరు

పెంచిన వంట గ్యాస్ ధరను తగ్గించకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు అన్నారు. బ్రాడిపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ, మండల కార్యదర్శుల సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి అధ్యక్షత వహించగా బాబూరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రత్యేకహోదా, విభజన చట్టంలోని హామీల అమలుకు, విశాఖ రైల్వే జోన్‌కు, పోలవరం ప్రాజెక్టు, కడప ఉక్కు నిర్మాణానికి నిధులు కేటాయించలేదన్నారు. పేదలకు ఉపాధి కల్పించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి రూ.38 వేల కోట్లు తగ్గించారని, సంక్షేమ, వ్యవసాయ రంగాలకు, ఎరువుల సబ్సిడీకి నిధులు తగ్గించారని చెప్పారు. నిత్యావసర సరుకులు, పెట్రోలు, డీజిల్ వంట గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపుతోందని, మరోవైపు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం 2లో

అక్రమంగా మిర్చి విత్తన తయారీ

సిఐటియు, సిపిఎం పరిశీలనలో బట్టబయలు

పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - మేడికొండూరు

కోరు తెప్పిస్తున్న కాలుష్యంపై పరిశీలనకు వెళ్లిన వారికి.. అనుమతి లేకుండానే మిర్చి విత్తనాల తయారు చేస్తుండడం తారసపడింది. సిఐటియు, సిపిఎం నాయకుల పరిశీలనలో సోమవారం వెలుగు చూసిన ఈ ఘటనపై వివరాల ప్రకారం.. మండలంలోని పేరేచర్ల కొండల ప్రాంతంలోని కొండల చెరువు వద్ద 10 రోజులుగా దహనం చేస్తున్న వ్యర్థాల వల్ల పొగ వ్యాపించడంతోపాటు దాని వల్ల స్థానికులకు కళ్లు మంటలు వస్తున్నాయి. ప్రతిరోజూ అర్ధరాత్రి 2 గంటల నుండి తెల్లవారుజామున 6 గంటల వరకూ ఇదే పరిస్థితి. ఈ విషయం తెలిసిన సిఐటియు మండల అధ్యక్షులు షేక్ బాషా, సిపిఎం నాయకులు సాదిక్ స్థానికులతో కలిసి ఆ ప్రాంత పరిశీలనకు సోమవారం వెళ్లారు. గుంటూరుకు చెందిన కొందరు అనుమతులు తీసుకోకుండానే మిర్చి విత్తనాలను తీయగా వచ్చిన తొడేలు, వ్యర్థాలను దహనం చేస్తుండడంతో పొగ, దాని వల్ల కళ్ల మంట వస్తున్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడున్న వారిని పట్టుకుని పంచాయతీ అధికారులకు అప్పగించారు.
వీరితోపాటు బీహార్‌కు చెందిన వలస కూలీల ద్వారా 2లో

నరసరావుపేట మండలం శంకరభారతిపురం పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నల్ల బ్యాడ్జీలతో విధులకు ఉపాధ్యాయులు

8లో

ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి రజిని

15న లింగంగుంట్లకు సిఎం

2లో

రోజాకు నేడు విశిష్ట మహిళా పురస్కారం

ప్రజాశక్తి -ఎఎన్‌యు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశిష్ట మహిళా పరిష్కారం -2023ను రాష్ట్ర క్రీడా సాంస్కృతిక యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్కే రోజా సెల్వమనికి మంగళవారం వర్సిటీలో అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి విసి పి.రాజశేఖర్ , రెక్టార్ పి.వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ తదితరులు హాజరుకానున్నారని మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ డా. కెవి శాంతి శ్రీ తెలిపారు.

నిడమర్రులో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని నిడమర్రులో మంగళవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిఈఈ అక్కల సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఎస్సీ కాలనీ శివాలయం ఏరియాలలో రోడ్డు విస్తరణ, విద్యుత్ లైన్లను పక్కకు మార్చుతున్న నేపథ్యంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

విజ్ఞాన్ అధ్యాపకుడికి పిహెచ్‌డి

ప్రజాశక్తి-గుంటూరు

అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.ప్రదీప్

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఈసీఈ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.ప్రదీప్‌కు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్ణాటక, సూరత్‌కల్ పీహెచ్‌డీ పట్టా అందించిందని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వీసీ పీ.నాగభూషణ్ తెలిపారు.' డిజైన్ అండ్ పెర్ఫార్మెన్స్ అనాలిసిస్ ఆఫ్ ఆప్టికల్ ఫ్రంట్ ఎండ్ ఆంప్లిఫైర్స్ యూజింగ్ నానో స్కేల్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని, ప్రదీప్‌కు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్ణాటక సూరత్‌కల్‌లోని ఈసీఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సందీప్ కుమార్ గైడ్‌గా వ్యవహరించారన్నారు. ప్రదీప్‌ను ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

గ్యాస్ ధర తగ్గించకుంటే ఉధృత ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

చేస్తోందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వమూ కేంద్రం బాటలోనే నడుస్తోందని, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించడం, ఆస్తి పన్ను, చెత్త పన్ను వసూలు చేయడం ఇందులో భాగమని అన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని, దీనికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయించాలని, జగనన్న కాలనీల్లో ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని, ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ తిర్మానాలను సమావేశం ఆమోదించింది. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, ఎన్.భావన్నారాయణ, ఈమని అప్పారావు, ఎస్.ఎస్.చెంగయ్య, కె.నళినీకాంత్ పాల్గొన్నారు.

అక్రమంగా మిర్చి విత్తన తయారీ

(మొదటి పేజీ తరువాయి)

ఆటోలో మిరపకాయలు తెచ్చిన గుంటూరుకు చెందిన కొండలును పట్టుకున్నారు. మొత్తంగా ఏడుగుర్ని పేరేచర్ల సర్పంచ్ డి.రాజ్‌కుమార్, కార్యదర్శి రెహమాన్‌కు అప్పగించారు. దీనిపై చర్యలు తీసుకోవడంతోపాటు కాలుష్యాన్ని నియంత్రించాలని డిమాండ్ చేశారు. దీంతో అనుమతులు లేకుండా ఇలా ఎందుకు చేస్తున్నారని పట్టుబడ్డ వారిని సర్పంచ్, కార్యదర్శి ప్రశ్నించారు. ఇలాంటి పనులు మళ్లీ చేయొద్దని చెప్పి పంపించారు.

జిజిహెచ్‌లో బోదకాలకు అరుదైన శస్త్ర చికిత్సలు

బోధకాలు బాధితునితో జిజిహెచ్ వైద్య బృందం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిజిహెచ్ బోధకాలకు అరుదైన శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. దీంతో రాష్ట్ర నలుమూలల నుంచి బోదకాలు బాదితులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు. సోమవారం బాధితులు 50 కిలోల బరువు గల బోదకాలుతో వైద్యం కోసం అనేక ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల వైద్యుల చుట్టూ తిరిగిన ఫలితం లేకపోవడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్లాస్టిక్ సర్జరీ విభాగం వైద్యులను సంప్రదించారు. ఈ వైద్యానికి గడచినా రెండేళ్లలో 15 మందికి పైగా బాదితులకు ఆ విభాగం హెచ్‌ఓడి డాక్టర్ సుమిత శంకర్ పూర్తి పరీక్షలు చేసి రెండు మూడు వారల పాటు పరిశీలనలో ఉంచి శస్త్ర చికిత్సలను విజయవంతం చేశారు. కాలు పై ఎక్కువగా ఉన్న చర్మాన్ని తీసివేసి మళ్ళీ రాకుండా ఉండేందుకు మైక్రో సర్జరీ చేస్తున్నట్లు ఆమె చెప్పారు. బోదకాలు సమస్యలు చాలామందికి అవగాహన లేకపోవడం భయాందోలనకు గురవుతున్నారని, అలాంటి వారి కోసం వాట్సాప్ గ్రూపును ప్రారంభించామని ఆమె వివరించారు. ఈ బృందంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు గంగా భవాని, చంద్రలేఖ, నజ్మా, కృతి, నిషాంత్, పీజీ విద్యార్థినులు నిఖిల, నవ్య, విజయలు సహకారం అందించారు. ఆరోగ్య శ్రీ ద్వారా కూడా ఉచితంగా రోగులకు శస్త్ర చికిత్సలు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి తెలిపారు. వైద్యులను ఆమె అభినందించారు.

జోరుగా అనధికార వెంచర్లు

(మొదటి పేజీ తరువాయి)

రోడ్ల నిర్మాణంతో అలంకరణ చేస్తున్నారు.

నర్సరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, గురజాల, చిలకలూరిపేట నియోజకవర్గాల్లో ఈ వెంచర్లు ఎక్కువగా వెలుస్తున్నాయి. కొత్త జిల్లా కేంద్రంగా నర్సరావుపేట నిర్ణయమైన తర్వాత నర్సరావుపేట, వినుకొండ నియోజకవర్గాల్లో ధరలు భారీగా పెంచారు. అంతర్గత రహదారుల కోసం అక్రమంగా గ్రావెల్ విక్రయిస్తున్నారు. నర్సరావుపేట, సత్తెనపల్లి మార్గంలో ఇటీవల రియల్ ఎస్టేట్ వెంచర్లకు అక్రమంగా గ్రావెల్ తోలకంపై నిర్వాహకులకు మైనింగ్ అధికారులు జరిమానా విధించారు. వందలాది లారీల మట్టిని అక్రమంగా తవ్వి తీసుకువచ్చినందుకు నర్సరావుపేట-సత్తెనపల్లి మార్గంలో మైనింగ్ అసిస్టెంట్ డైరక్టర్ కొండారెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేసి రూ.3.60 కోట్ల ఫెనాల్టిని విధించారు.

కొన్ని ప్రాంతాల్లో జలవనరులశాఖ ఆస్తుల్లో కూడా రియల్టర్లుకొంత మంది రహదారులు నిర్మిస్తున్నారు. ప్రధాన రహదారికి లోపల ఉన్న వెంచర్ల నుంచి ప్రధాన రహదారులకు అనుసంధానం చేసేందుకు కాల్వగట్లను అక్రమించి రోడ్లు నిర్మిస్తున్న ఘటనలు ఇటీవల నర్సరావుపేట ప్రాంతంలో వెలుగు చూశాయి. సత్తెనపల్లి, ములకలూరు ప్రాంతంలో ఏకంగా కాల్వగట్లను అక్రమించి భారీ రహదారిని నిర్మించడం వివాదస్పదం అవుతోంది. చాలాచోట్ల వెంచర్ నిర్వాహకుల నుంచి విఆర్ఒ స్థాయి అధికారులు లంచాలు తీసుకుంటున్నారని మండల, డివిజన్ స్థాయి అధికారులకు తెలిసినా వారు మిన్నకుండిపోతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

నర్సరావుపేట పరిసరాల్లో గతంలో సెంటు రూ.3 నుంచి 4 లక్షలు పలికిన భూములు ఇప్పుడు సెంటు రూ.10 నుంచి రూ.15 లక్షలకు విక్రయిస్తున్నారని తెలిసింది. వినుకొండ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోనూ అనధికారిక వెంచర్లకు ప్రజాప్రతినిధుల సహకారం ఉన్నట్లు సమాచారం. వినుకొండ-కర్నూలు రహదారిలో ఇటీవల వెంచర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. వినుకొండ -బొల్లాపల్లి మార్గంలో వెంచర్ల జోరు కొనసాగుతోంది.

రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షణపై 12న సభ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షణపై జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ ఉదయం 10:30 గంటలకు స్థానిక హెూటల్ గ్రాండ్ నాగార్జునలోహైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ ప్రసంగిస్తారు. దేశవ్యాప్తంగా రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యమౌతున్న పరిస్థితుల్లో వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందిని రాజ్యాంగ పరిరక్షణ కోసం మేధావులు ,ప్రజాసంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా కృషి చేయడానికి సమయం ఆసన్నమైందని వేదిక అధ్యక్షులు లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. ఈ సభకు సమన్వయ కర్తలుగా ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు, నాయశాస్త్ర ఆచార్యులు ప్రో.యన్.రంగయ్యలు వ్యవహరిస్తారని తెలిపారు.

ఘనంగా మహదేవలాల్ ష్రాఫ్ జయంతి వేడుకలు

మాట్లాడుతున్న ప్రొఫెసర్ రఘురామ్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ప్రొఫెసర్ మహదేవ లాల్ ష్రాఫ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మొహాలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసుటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.రఘురామ్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాదేవ లాల్ ష్రాఫ్ బి.టెక్ చదివిన తరువాత బనారస్ హిందూ యూనివర్సిటీ వీసీ మదన్ మోహన్ మాలవియా పర్యవేక్షణలో 1932లో ఫార్మసీ డిగ్రీ కోర్సు ప్రారంభించారని, ఆ తరువాత బిట్స్ పిలానిలో, బెంగాల్‌లోని జాదవ్ పూర్‌యూనివర్సిటీలో ఫార్మసీ కోర్సులు ప్రారంభించి స్వాతంత్ర సమరంలో పాల్గొని ఫార్మా పరిశ్రమల స్థాపనకు కృషి చేశారన్నారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ష్రాఫ్ పుట్టిన రోజును ఫాదర్ ఆఫ్ ఫార్మసీ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా వేడుకగా నిర్వహించాలని సూచించిందన్నారు. కార్యక్రమంలో కళాశాల గౌరవాధ్యక్షులు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడారు. ఈ సందర్భంగా ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ లైఫ్ మెంబర్‌షిప్ పొందిన కళాశాల అధ్యాపకులకు సభ్యత్వ నమోదు సర్టిఫికెట్లను రఘురామ్ అందచేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ప్రినిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. రవికుమార్, ఫార్మా.డి.డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

15న లింగంగుంట్లకు సిఎం జగన్

రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 15న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. మండలంలోని లింగంగుంట్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని సోమవారం పరిశీలించారు. ఆమెవెంట వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, ఆరోగ్యశ్రీ సిఇఒ హరింద్ర, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జెసి శ్యామ్‌ప్రసాద్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి శోభారాణి తదితరులున్నారు.

భూమి పట్టాల కోసం ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను నెలలో పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ చర్లగుడిపాడు, జంగమహేశ్వరపురం రెవిన్యూ పరిధిలో భూరీసర్వే జరుగుతుందని, అది పూర్తయ్యాక భూములపై హక్కులు ఎవరికి ఉన్నాయో విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిస్తామని అన్నారు. ఆందోళన చెందొద్దని, వాస్తవ లబ్ధిదార్లకు న్యాయం చేస్తామని చెప్పారు.

న్యాయ పోరాటానికి కమిటీ ఏర్పాటు

ఇదిలా ఉండగా భూముల పరిరక్షణ ఉద్యమం కోసం 12 మందితో న్యాయ పోరాట కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. కన్వీనర్‌గా పత్రా ఆదాం, సభ్యులుగా కొమ్ము అక్కులు, పేరుపోగు మరియదాసు, బందెల సువర్ణబాబు, పత్రా బంగారమ్మ, పేరుపోగు దానమ్మ, పత్రా వజ్రం, పేరుపోగు దేవమ్మ, పత్రా చినబాబు, పేరుపోగు రాణమ్మ, పేరుపోగు కోటేశ్వరరావు, కడెం యలమంద ఎన్నికయ్యారు. పోరాటానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు ప్రకటించారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ డీవీవీఎస్ సోమయాజులు

మహిళలు ఉన్నతంగా రాణించాలి

పజాశక్తి - గుంటూరు లీగల్:మహిళలు ఉన్నతంగా రాణించి హక్కులను సాధించుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి, గుంటూరు జిల్లా పోర్టుపోలియో జడ్జి జస్టిస్ డీవీవీఎస్ సోమయాజులు తెలియజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి జీడీఏ లేడి రప్రజెంటేటివ్ ఎం.నాగలక్ష్మి అధ్యక్షత వహించారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.సుజాత, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప అంతర్జాతీయ మహిళా దినోత్సవం గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైమిఎస్జీ పార్థసారథి, జిల్లా జడ్జిలు, సబ్ కోర్టు జడ్జిలు. జూనియర్ సివిల్ జడ్జి జీబీఏ ప్రెసిడెంట్ పాలడుగు వెంకటేశ్వర్లు, జీబీఏ, కార్యవర్గం, సీనియర్, జూనియర్ న్యాయవాదులుపాల్గొన్నారు

రేపు మహిళలకు ఉచిత ఫిజియోథెరపీ

ప్రజాశక్తి - మంగళగిరి:మంగళగిరి భగవంతులవారి వీధిలో విహాన్ ఫిజియోథెరపీ సెంటర్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 8వ తేదీన మహిళలకు ఉచితంగా ఫిజియోథెరపీ వైద్యం అందించబడుతుందని ఫిజియోథెరపిస్ట్ బి.పవిత్ర తెలిపారు. మహిళలకు సాధారణంగా వచ్చే నడుము నొప్పి, సయాటిక, డిస్క్ సమస్య, వెన్నునొప్పిలకు వారం రోజుల పాటు ఉచితంగా ఫిజియోథెరపీ అందించడం జరుగుతుందన్నారు. కావున నగర పరిసర ప్రాంతాల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి - పలువురికి గాయాలు

ప్రజాశక్తి-వినుకొండ

గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్కాపురం రోడ్ మండలంలోని చీకటీగలపాలెం మోడల్ స్కూల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. చిలకలూరిపేట మండలం మురికిపూడికి చెందిన పోతురాజు చెంచయ్య (44), అదే గ్రామానికి చెందిన కుప్పన బోయిన వీరయ్య (45), ద్విచక్ర వాహనంపై ప్రకాశం జిల్లా దొనకొండ వెళ్తుండగా మార్గ మధ్యంలో చీకటీగలపాలెం మోడల్ స్కూల్ వద్ద జాతీయ రహదారిపై వినుకొండ వైపు వస్తున్న లారీ, వారి వాహనాన్ని ఢీ కొట్టింది. ఢీ కొనడంతో ఇరువురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు చెంచయ్య, వీరయ్యలు ఎలక్ట్రికల్ ప్రభలకు లైటింగ్ సమకూర్చే కార్మికులు. ఆదివారం ఈపూరులో జరిగిన తిరుణాలకు ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ ప్రభలకు లైటింగ్ సమకూర్చేందుకు వచ్చారు. తిరుణాళ్ల ముగియడంతో బంధువుల ఇంట్లో ఉండి సోమవారం ప్రకాశం జిల్లా దొనకొండ మండలం మునగపాడులో తిరుణాళ్లకు వెళ్లిన ఎలక్ట్రికల్ ప్రభకు లైటింగ్ సమకూర్చేందుకు వాహనంపై వారు సోమవారం మధ్యాహ్నం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. పోతురాజు చెంచయ్యకు భార్య వెంకటేశ్వరమ్మ, ఇద్దరు మగ సంతానం ఉన్నారు. కుప్పనబోయిన వీరయ్య కు భార్య చెన్నమ్మ, ఇద్దరు మగపిల్లలు. పట్టణ సిఐ అశోక్ బాబు, ఎస్సైలు సంఘటన ప్రాంతానికి చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు.

ప్రదీప్ మృతదేహం

చీకటిగలపాలెం వద్ద రోడ్డు ప్రమాదం

దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదం

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ..

ప్రజాశక్తి - మాచర్ల

రాయవరం అడ్డరోడ్డు సమీపంలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు మాచర్ల పట్టణ సమీపంలో జీవి గ్రాండ్ షోరూమ్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరుకు చెందిన మేళ్లటూరి ప్రదీప్, అమ్మాయితో కలిసి ద్విచక్ర వాహనంపై మాచర్ల నుండి గుంటూరు వైపు వెళుతున్నాడు. జమ్మల మడక గ్రామానికి చెందిన పేర్ల అశోక్, పెద్దింటి దావీదులు ద్విచక్ర వాహనం, ప్రదీప్ వాహనాన్ని ఎదురెదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రదీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. అశోక్, దావీదు, ప్రదీప్, మోటర్ సైకిల్ పై ఉన్న కల్పన అనే అమ్మాయిని మెరుగైన చికిత్స కోసం మాచర్ల నుండి నరసరావుపేట తరలించారు. ఈ ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో రోడ్డు ప్రమాదం రాయవరం పోలేపల్లి గ్రామాల మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న వారిని ఆటో ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాయవరం పోలేపల్లి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారు మండాది గ్రామానికి చెందినవారు .వెల్దుర్తి మండలం డి.తేజ, కోటేశ్వరరావు ,శ్రీను ముగ్గురు కలిసి దుర్గి నుండి మండాది వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. 108 ద్వారా మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో బోల్తా..

ప్రజాశక్తి-దుగ్గిరాల

తెనాలి- విజయవాడ రహదారిపై తుమ్మపూడి గ్రామ సమీపంలో ఆటో ప్రమాదం జరిగింది. ఆటో నడుపుతున్న ఓనర్ కం డ్రైవర్ పాపన యాదగిరికి గాయాలయ్యాయి. మంగళగిరి నుండి తెనాలి వైపు వస్తుండగా గతుకుల మయంగా ఉన్న రోడ్డుపై గుంతను తప్పించి పోయి ఆటో బోల్తా కొట్టింది. రోడ్డు ప్రక్కన ఉన్న రైలింగ్ కు తగిలి పెద్ద ప్రమాదం తప్పింది. డ్రైవర్ నడుముకు గాయాలయ్యాయి అతనిని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటోలో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వేరే ఆటోలలో వారు వెళ్లిపోయారు.

డిజర్ల రేషన్ షాపులో తనిఖీలు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఊడిజర్ల గ్రామంలో రేషన్ షాపు నెంబర్ 22లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసిల్దార్ లు విద్యాసాగర్,లక్ష్మణ్ లు సోమవారం తనిఖీలు జరిపారు. తనిఖీలలో సరుకులో ఎటువంటి వ్యత్యాసం లేదని అన్ని సక్రమంగానే ఉన్నాయని సిఎస్ డిటి విద్యాసాగర్ తెలిపారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-నరసరావుపేట

నరసరావుపేట సాతులూరు రైల్వే స్టేషన్ మధ్య కంభంపాలెం ప్రాంతం సమీపంలో గుర్తు తెలియని వృద్ధురాలు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు నరసరావుపేట రైల్వే ఎస్.ఐ సుబ్బారావు సోమవారం తెలిపారు. వృద్ధురాలి వయసు సుమారు 60 ఏళ్లు ఉంటాయన్నారు. మృతదేహాన్ని ఏరియా గవర్నమెంట్ హాస్పిటల్ నరసరావుపేట మార్చురీ కి తరలించినట్లు పేర్కొన్నారు. మృతురాలు ఆకుపచ్చ రంగు జాకెట్, వంకాయ రంగు చీర ధరించి ఉందన్నారు. ఆనవాలు తెలిసిన వారు 99485 25386 నంబరులో సంప్రదించాలని కోరారు.

బాపూజీ వృద్ధాశ్రమానికి బియ్యం వితరణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణములోని బాపూజీ వృద్ధాశ్రమమునకు 3 క్వింటాళ్ల బియ్యాన్ని జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా జాన్ సైదా మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా బాపూజీ వృద్ధాశ్రమం నిర్వాహకులు నిరాటంకంగా అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. వృద్ధుల కోసం వారుచేస్తున్న సేవా చాలా గొప్పదని, తమ వంతు సహాయము తాము చేస్తున్నామని ఆయన అన్నారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బా రావు, పోతవరం సర్పంచ్ భాషా మేస్త్రీ, షేక్ కరిముల్లా, ఆశ్రమము నిర్వహుకులు ఆర్యధ్యుల రామకృష్ణ,మురికిపూడి ప్రసాద్, మానుకొండ శేషిరెడ్డి, నకరికంటి శ్రీకాంత్, కరీమ్, లా లూ, జిలాని తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మానందానికి సత్కారం

ప్రజాశక్తి-నరసరావుపేట

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గానలహరి సినీ సంగీత విభావరి వారు నిర్వహించిన స్వరరాగార్చన-4 కార్యక్రమంలో పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన విశ్వజననీ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందానికి ఘన సన్మానం జరిగింది. రాజమండ్రి పుష్కర్ ఘాట్ వద్ద గల ఎన్జీవో హోంలో ఆదివారం స్వరరాగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేదికపై పలువురు మహిళలతో పాటు, ప్రతి మహిళ విజయానికి కారణమైనటువంటి పురుషులను, సమాజానికి నిస్వార్థంగా సేవలు అందిస్తున్న సంస్థలను గుర్తించి ఘనంగా సత్కరించి అవార్డులను ప్రధానం చేశారు. స్వరరాగార్చన విజయవాడ అధ్యక్షులు ఉలవలపూడి వెంకటరత్నం, రాజమండ్రి శాఖ ఉపాధ్యక్షులు విటల్ ఇట్టా, తాడేపల్లిగూడెం శాఖ జనరల్ సెక్రెటరీ బొల్లాప్రగడ ఉదయభాను, హైదరాబాద్ శాఖ గౌరవ సలహాదారులు దవులూరి శారదల ఆధ్వర్యంలో రుడా చైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డి, ఏపీ సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి తదితర ప్రముఖుల చేతుల మీదుగా బొగ్గారపు బ్రహ్మానందానికి సాలువ కప్పి పూలమాలలు వేసి సత్కరించి అవార్డును ప్రధానం చేశారు.

మద్యం మత్తులో ఘర్షణ- ఒకరి హత్య

ప్రజాశక్తి-తెనాలి

మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. పట్టణ టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనపై సీఐ ఎస్ వెంకట్రావు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. వినుకొండ మండలం గోకనకొండకు చెందిన గండికోట అంకారావు(40) గత కొంతకాలం క్రితం తెనాలి వచ్చి నందుల పేట ఇటీ కాలనీలో ఉంటున్నారు. అతనితోపాటు పనిచేస్తున్న వేముల నాగరాజు స్థానిక బస్టాండ్ సమీపంలోని మమతాబార్ వెనక నివాసం ఉంటున్నాడు. ఇద్దరు కలిసి మద్యం సేవించడం అలవాటుగా మారింది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి నాగరాజు ఇంట్లో ఇరువురు కలిసి మద్యం సేవించారు .అనుకోని విధంగా ఇద్దరు మధ్య ఘర్షణ చెలరేగడంతో నాగరాజు కత్తిపీట చెక్కతో అంకారావు తలపై మోదగా అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇరువురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

అంకారావు మృతదేహం

మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	1,18,338
మిర్చి ఎగుమతి	:	1,15,459
మిర్చి నిల్వ	:	76,061

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,500 - 23,500
నెం.5	10,500 - 22,500
273	13,000 - 21,000
341	9,500 - 23,000
4884	16,500 - 16,500
సూపర్ 10	16,000 - 21,000
నాన్ ఎసి	
తేజ	9,500 - 21,500
బడిగి	10,000 - 26,000
దేవనూరు డీలక్స్	10,000 - 23,500
తాలుకాయలు	6,000 - 13,000

విజయవాడ 7వ అదనపు జిల్లా కోర్టులో
ఓ.యస్.నెం. 109/2019

కె.జె.ఎన్.ప్రసాద్ ... వాది
వర్సెస్
క్రైలా దేవదాస్ & వగైరాలు ... ప్రతివాది

D8 : మక్కెన ప్రకాష్, 19-15-20/21, ఫస్ట్‌లైన్, ఐ.పి.డి. కాలనీ, గుంటూరుబజార్, గుంటూరు.
D17 : కె.ధర్మారావు, తండ్రి : మోషే, 2-09, అనంతవరం గ్రామం, తుళ్లూరు మండలం, గుంటూరుజిల్లా.

పై దావాలోని ప్రతివాదులు మీద ది.24-12-2016న వ్రాయించి ఇచ్చిన సేల్ అగ్రిమెంట్‌లో ఉదహరించిన మొత్తం మరియు వడ్డీతో సహా ఇప్పించమని యీ నెంబరు దావా దాఖలు చేయగా 8 మరియు 17 ప్రతివాదులకు దావా నోటీసు నిమిత్తం ది.23-3-2023వ తేదీకి వాయిదా వేసినారు. సదరు ప్రతివాదులకు ఏమైనా ఆక్షేపణలున్నచో పై వాయిదా రోజు పై కోర్టులో హాజరయి తెలుపుకోవలెను. లేనిచో పరోక్షమందు తీర్మానించబడును.

ఇట్లు
పి.శేషుమోహన్,
వాది తరపున అడ్వకేట్,
గవర్నర్‌పేట, విజయవాడ.

డాక్యుమెంట్లు పోయినవి

గుంటూరుజిల్లా, ఎం.టి.ఎం.సి. పరిధిలోని తాడేపల్లి, డోలాస్‌నగర్‌కు చెందిన మన్నవ సుశీల భర్త బాబూజీ కి సంబంధించిన 200 గజాల స్థలంలో రేకుల షెడ్డు ఇంటి డాక్యుమెంట్స్ పోయినవి. మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 02-01-2010లో 363/2010 నెంబర్‌తో రిజిస్ట్రేషన్ జరిగినది. 27-02-2023 తేదీన డోలాస్ నగర్ నుండి ఉండవల్లి సెంటర్‌కు బ్యాంకు పని నిమిత్తం ఆటోలో వస్తుండగా ఒరిజినల్ డాక్యుమెంట్స్ జారి క్రింద పడిపోయాయి. తిరిగి వెదికిననూ కనిపించలేదు. ఎవరికైనా పైన పేర్కొన్న ఒరిజినల్ దస్తావేజులు దొరికిన యెడల క్రింది నెంబర్‌కు ఫోన్ చేయగలరు.

ఇట్లు
మన్నవ సుశీల, భర్త : బాబూజి,
సెల్ : 8885108020

GENERAL NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL. SENIOR CIVIL JUDGE:: GUNTUR
S.O.P.No : 3/2023

Between:
1) Chunduru Venkata Siva Nega Prasanna Lakshmi Devi, W/o. late Seshasayana Rao, 2)Chunduru Naga Sai Teja, S/o. late Seshasayana Rao,presently both are R/o.Flat No.B-303, Bhavya's Anandam,Opp. CMR Shopping Mall, Nizampet, Hyderabad-90.

And

1) Franklin Templeton Asset Management [India] (P) Ltd.,Rep.by its Authorized Person having its Reg. office at One International Center Tower, 12th & 13th Floor, Senapathi Bapat Marg, Elphinestone West, Mumbai-13,2) AMFI, Computer Age Management Services Ltd., Rep.by its having its Office situated at 178/10, Kodambakkam High Road, Opposite Hotel Palm Grove Chennai,3) Bambino Agro Industries Ltd., R/b. its Authorized Person having its office at 4E,Surya Towers,Sardar Patel Road, Secundrabad.....Respondents

పై నెంబరు లోని పిటీషనర్ల 1వ వారికి భర్త, 2వ వారికి తండ్రి గారైన చుండూరు శేషశయనరావు గారు ఆయన జీవించియున్న సమయములో రెస్పాండెంట్లు కంపెనీలలో షేర్లు కొనుగోలు మరణించినందున, సదరు శేషశయనరావు గారి యొక్క డెత్ బెనిఫిట్స్ అయిన షేర్లు తాలూకూ మొత్తములను రెస్పాండెంట్స్ కంపెనీల వద్ద నుండి పొందుటకు వారసత్వ సర్టిఫికెట్ కొరకు పిటీషన్ దాఖలు చేయగా సదరు పిటీషన్‌పై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరములు వుంటే తెలుపుకొన వలసినదిగా కోరుచూ శ్రీ కోర్టువారు జనరల్ నోటీసు నిమిత్తము ది. 23-04-2023కి వాయిదా వేసినారు. ఆ రోజున ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్టప్రకారం తీర్మానించబడును.

వాయిదాతేది : 24-04-2023

కేసానుపల్లి వెంకట శ్రీరామ సుబ్బారావు,
పిటీషనర్ల తరపు న్యాయవాది,
6/4 అరండల్‌పేట, గుంటూరు.
సెల్ : 98491 87315.

అర్జీదారులకు సహకారం అందిస్తున్న సిబ్బంది

ఆస్తి, కుటుంబ వివాదాలపై ఫిర్యాదులు

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి పోలీస్ ఉన్నతాధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఆయా పోలీస్ స్టేషన్లకు సిఫార్సు చేసినట్లు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. సమస్యలకు సంబంధించి ప్రజల నుండి ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి,నిర్ణీత గడువులోగా ఫిర్యాదులను పరిష్క రించాలని ఆదేశించారు. కుటుంబ,ఆర్థిక, ఆస్తి తగాదాలు మొదలగు సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ప్రజల నుండి అందాయని పేర్కొ న్నారు.

తాగునీటి ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న వైవి ఆంజనేయులు

ఉచిత తాగునీటి ట్యాంకర్ ప్రారంభం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజల దాహార్తి తీర్చేందుకు ఉచిత మంచినీటి ట్యాంకర్‌ను మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు ప్రారంభించారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎన్టీఆర్ భవన్ వద్ద ఉచిత మంచినీటి ట్యాంకర్ ను వై వి ఆంజనేయులు,పార్టీ శ్రేణుల సమక్షంలో ప్రారంభించి మాట్లాడారు. పట్టణ పరిసర, గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత మంచినీటి ట్యాంకర్‌ను వినియోగించుకోవాలని కోరారు. అన్ని వివాహాది శుభ కార్యక్రమాలకు, గ్రామాలలో జరిగే తిరునాళ్ళ మహోత్సవాలకు ఈ సౌకర్యాన్ని ఉప యోగించుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకర్‌ను ఎలాంటి అవసరాల నిమిత్తం ఎన్టీఆర్ భవన్‌ను సంప్రదించాలని తెలి పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు , జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల సాంబయ్య, పార్టీ అధ్యక్షులు కటకం అమరవెంకటకృష్ణ , ఆళ్ల అమరేశ్వరావు, బత్తుల నాగేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

తిరుణాళ్లలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల పరిధిలోని చెంఘిజ్‌ఖాన్‌పేట గ్రామ సచివాలయం పరిధిలోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారి 39వ తిరుణాళ్ల ఉత్సవాల సందర్భంగా దేవస్థానం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దేవస్థానం కమిటి, సర్పంచ్ విజ్ఞప్తి మేరకు యడ్లపాడు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గోపినాయక్ ఆదేశాను సారం ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో హెచ్‌ఎస్ కోటేశ్వరరావు, హెచ్‌వి గంగానమ్మ, ఎఎన్‌ఎం, తమ సమ్మా, హెల్త్ అసిస్టెంట్స్ వెంకటేశ్వరరెడ్డి, బుజ్జి, ఎంఎల్‌హెచ్‌పి శ్రీలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టరు 'స్పందన'కు 163 ఫిర్యాదులు

సత్వర పరిష్కారానికి పల్నాడు కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా నరసరావు పేట కలెక్టరేట్ కార్యాలయం లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్పందన కాన్ఫరెన్సు హాల్ లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరష్కార వేదిక (స్పందన) జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ప్రజలు నుంచి వస్తున్న ఆర్జీలను స్వీకరించి, పరిశీలించిన వెంటనే వారికి పరష్కార మార్గం చూపాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి ఆర్జీలను (ఫిర్యాదుల రూపంలో) స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపిన కలెక్టర్ వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 163 వినతులను స్వీకరించారు. స్పందన ఆర్జీలను ఇచ్చేందుకు వచ్చిన ప్రజలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శాశ్వత సభ్యులు మద్ది రామచంద్ర రావు,మద్ది రామ బ్రంహ్మానంద రావుల సహకారంతో సుమారు 250 మందికి ఉచిత అన్నదానం నిర్వహించారు. దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, డిఆర్ఓ వినాయకం పాల్గొన్నారు.

బతికుండగానే చంపేశారు..

తాను బతి కుండగానే చని పోయినట్లు మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించి తన పేరుపై ఉన్న ఆస్తిని కొడుకు కోడలు కాజేసి తనకు అన్యా యం చేశారని చిలకలూరిపేటకు చెందిన కోటేశ్వరమ్మ కలెక్ట ర్‌కు ఫిర్యాదు చేశారు. కొడుకు సుబ్బారావు, కోడలు తిరుపతమ్ములు తనను ఇం ట్లో నుంచి నెట్టివేశారని తెలిపింది. పుట్టిం టివారు తనకు ఇచ్చిన ఎకరం భూమిని తాను చనిపోయినట్టుగా సర్టి ఫికెట్ సృష్టించి, తప్పుడు రిజిస్ట్రేషన్ చేసి రూ.40 లక్షలకు అమ్ము కున్నారని పేర్కొంది. విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. ఈ విష యమై సంబంధిత తహశీల్దారుకు కలెక్టర్ ఆదేశించారు.

రేషన్ బియ్యం అమ్ముకుంటున్నారు

పేదలకు అందించాల్సిన రేషన్ బియ్యాన్ని వైసిపి నాయకులు అక్రమంగా అమ్ముకొని దోచుకుంటున్నారని నరసరావుపేట టిడిపి ఇన్‌ఛార్జి చదలవాడ అరవింద బాబు ఆరోపిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇసుక, మైనింగ్, మద్యం, రియల్ ఎస్టేట్ భూ దందా వంటి అక్రమాలు చాలక రేషన్ బియ్యాన్ని కూడా వారు పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. స్వప్న ట్రేడర్స్, కామధేను రైస్ మిల్లులో ఎఫ్‌సిఐ బియ్యం అక్రమ నిల్వలు చేస్తున్నారని ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. పెద్దరెడ్డిపాలెం వద్ద రేషన్ అక్రమరవాణా చేస్తున్న వాహనం, పాఠశాల విద్యార్థిని ఢీ కొట్టడంతో అతని మృతి చెందినా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. విద్యార్థి మరణం ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని విమర్శించారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి నరసరావుపేట మున్సిపల్ నిధులను ఇష్టానుసారంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే దుర్మార్గాలకు సహకరించలేదని మున్సిపల్ కమిషనర్లను మారుస్తున్నారని, నాలుగేళ్లలో ఐదు మంది కమిషనర్లు నరసరావుపేట నుండి వెళ్లిపోవడం జరిగిందన్నారు. టిడ్కో గృహాల లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్నారని, మునిసిపాలిటీలో పన్నుల రూపేణా ఏడాదికి వస్తున్న రూ.8 కోట్లు

ఖర్చుల వివరాలు ఇవ్వాల్సిందిగా సమాచార హక్కు చట్టం ద్వారా అడిగితే ఇబ్బందికి గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని వారికి కలెక్టర్ హామీ ఇచ్చారు.

మా భూమిని ఆక్రమించారు

తన రెండు ఎకరాల భూమిని గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, శ్రీను ఆక్రమించారని వారిపై చర్యలు తీసుకోవాలని వెల్దుర్తి మండలం ఉప్పలపాడుకు చెందిన మహిళ నారాయణమ్మ ఫిర్యాదు చేశారు. కూలీ పనుల నిమిత్తం తమ కుటు ంబం బెంగళూరుకు వెళుతుంటామని, తాము సాగు చేయట్లేదని, ఆక్రమించుకొని దౌర్జన్యం చేస్తున్నట్లు ఆరోపించారు. తమ పూర్వీకుల ఆస్తికి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు కూడా ఉన్నాయని, విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

శ్మశాన స్థలం కేటాయించండి

శ్మశాన భూమిని కేటాయించాలని కారంపూడి మండలం మిర్యాలకు చెందిన ఎస్సీలు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. మాల మహా నాడు ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన మహిళలు కలెక్టర్‌కు వినతిపత్రం సమ ర్పించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గోదా జాన్ పాల్ మాట్లాడుతూ ఎస్సీ లకు శ్మశాన వాటిక కేటా యించాలన్న జిఒ ఉన్న ప్పటికీ అధికారులు అమలు చేయ డంలో చిత్తశుద్ధి లేదన్నారు. వెంటనే శ్మశానానికి భూమి కేటాయించా లని డిమాండ్ చేశారు.

నేటి నుంచి సాగరమాత మహోత్సవాలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం విజయపురి సౌత్‌లోని కృష్ణా నది తీరాన ఉన్న సాగరమాత దేవాలయ మహోత్సవాలను నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఆలయానికి ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి వేలాది మంది సందర్శకులు తరలిరానున్నారు. భారతీయ సంప్రదాయ రీతులలో నిర్మించిన తొలి క్రైస్తవ మందిరంగా సాగరమాత ఆలయం పేరుగాంచింది. ధూప,దీప, నైవేద్యాలు, తలనీలాలు, మొక్కులు చెల్లించుకొనే కార్యక్రమాలన్నీ పూర్తిగా హిందూ పద్ధతిలో జరిగే క్రైస్తవ ఆలయం ఇది. ఈ మందిరానికి 1977 అక్టోబర్ 10వ తేదీన అప్పటి గుంటూరు మండల పీఠాధిపతి కాగితపు మరియదాసు ప్రారంభోత్సవం చేశారు. దీని నిర్మాణానికి మరియదాసుతో పాటు ముమ్మడి ఇగ్నేషియన్, తానుగుండ్ల బాలశౌరి కృషి చేశారు. 2011 మార్చి 6న కృష్ణానదీ తీరంలో నిర్మించిన జపమాల క్షేత్రాన్ని గుంటూరు పీఠాధిపతులు గాలిబాలి ప్రారంభోత్సవం చేశారు. గత ఏడాది సాగరమాత దేవాలయంపై, ఆలయంలో 14 స్థలాల విగ్రహాలపై దేవదూతల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఏసుక్రీస్తు జీవితం గురించి ఏర్పాటు చేసిన 20 జపమాలా స్థలాలు, ధ్యానమందిరం ఇక్కడ ఉన్నాయి. ఉత్సవాల నేపథ్యంలో 7వ తేదీ నుంచి 9 వరకు దివ్యసత్ప్ర సాధన, నిత్య ఆరాధనలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కొప్పునూరు వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. మాచర్ల ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రతి అర గంటకు మాచర్ల నుంచి విజయపురి సౌత్ లోని సాగర్ మాత ఆలయానికి బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయి. మాచర్ల రూరల్ సిఐ షేక్ సమీముల్లా ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో గుంటూరు ఒమేగా కేన్సర్ స్పెషాలిటి సౌజన్యంతో మంగళవారం ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరము నిర్వహిస్తు న్నారు. ఈ విషయాన్ని క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ గట్టు సరోజిని, క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు ఎన్. రాజ్యలక్ష్మి, ఎన్.జయలక్ష్మి తెలిపారు. స్థానిక గాంధీపేటలో ని డాక్టర్ గట్టు రంగారావు హాస్పిటల్ లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం నిర్వహించనున్నారు. సుమారు రూ.4 వేల విలువ చేసే గర్భసంచి ముఖద్వార పరీక్ష (పాస్ స్మియ ర్), ఈసిజి (గుండె పరీక్ష),బి.పి. షుగర్ తదితర పరీక్షలు ఉచితంగా చేయనున్నారు. చిలకలూరిపేట పట్టణ, పరిసర ప్రాంత మహిళలుఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గీతాంజలి స్కూల్స్‌లో ఉమెన్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక గీతాంజలి స్కూల్స్‌లో ఉమెన్స్ డే వేడుకలు ఘనంగా ప్రారం భించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తేళ్ళ క్రిష్ణవేణి మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన జరగనున్న ఉమెన్స్ డేను పురస్కరించుకొని తమ పాఠశాలలోని విద్యార్థుల తల్లులకు వివిధ రకాల ఆటల పోటీలను రెండు రోజులు సోమ, మంగళవారాలు నిర్వ హిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు ఉమెన్స్ డే నాడు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. అనంతరం నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విద్యార్థులు తల్లులు ఉత్సాహంగా పాల్గొ న్నారు. కార్యక్రమంలో కరెస్పాండంట్ వై.ఎల్. కిషోర్, ఉపాధ్యాయులు, తల్లిదం డ్రులు , విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీలు రీ ఓపెనైతే నోటీసులు జారీ

గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

స్పందన పిటీషన్లు సరిగా పరిష్కరించకుండా రీ ఓపెన్ అయితే సిఎంఓ నుండి సంబంధిత అధికారికి నోటీసులు జారీ చేయబడతాయని, కావున పిటిషన్‌ను హేతుబద్ధంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి, డిఆర్‌ఓ కె.చంద్రశేఖర్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.వెంకట శివరామిరెడ్డి, జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ స్పందనలో 139 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ మోహన్‌రావు, డీఆర్డీఏ, డ్వామా, మెప్మా, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్లు హరిహరనాథ్, యుగంధర్‌కుమార్, వెంకట నారాయణ, సాయినాథ కుమార్ పాల్గొన్నారు.

అర్జీలు అందజేసి మాట్లాడుతున్న సెక్యూరిటీ గార్డులు

ఎయిమ్స్ సెక్యూరిటీ గార్డులను విధుల్లోకి తీసుకోవాలి

మంగళగిరి ఎయిమ్స్‌లో తొలగించిన సెక్యూరిటీ గార్డులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని స్పందనలో అర్జీ అందచేశారు. 2019 ఉండి 106 మంది సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నామని, కోవిడ్ సమయంలోనూ విధులు నిర్వహించామని తెలిపారు. నిర్మాణ దశ నుండి అక్కడే పనిచేస్తున్నామని చెప్పారు. ఇప్పుడు అన్ని సౌకర్యాలు వచ్చిన తర్వాత తమలో 21 మందిని ఉంచి మిగిలిన 84 మందిని తొలగించారన్నారు. కొందర్ని మాజీ సైనికుల్ని తీసుకున్నారన్నారు. సూపరింటెండెంట్ రామ్మోహన్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ బత్తినేని హరికృష్ణ వారికి ఇష్టమైన వారిని ఉంచి, మిగిలిన వారిని తొలగించారన్నారు. ఇంటర్వ్యూ చేసి పనిలోకి తీసుకుంటామని గత నెల 13న పిలిచి ఉదయం నుండి సాయంత్రం వరకూ ఉంచి ఇంటర్వ్యూ చేయకుండానే పంపించారన్నారు. తమకు అన్యాయం జరిగిందని, కుటుంబాలను రోడ్డుపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో కోటేశ్వరరావు, రవికుమార్, సుబ్బారావు, సుధాకర్ తదితరులున్నారు.

కాలేజీలో సర్టిఫికెట్లు ఇపించాలి

తన భర్త మరణంతో కుమారిడిని చదివించే స్థోమత లేదని, తన కుమారిడికి కాలేజి వారి నుండి సర్టిఫికెట్స్ ఇప్పించాలని స్థానిక హనుమాన్ నగర్‌కు చెందిన రావూరి ఈశ్వరి అర్జీ అందచేశారు. సత్తెనపల్లి కరెంటు ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ తన భర్త చనిపోయారని, భర్త ఉద్యోగం కుమారిడికి ఇప్పించటానికి సర్టిఫికెట్స్ అవసరం అయ్యాయన్నారు. తన కుమారుడు హేమంత్ సాయి చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్‌లో మొదటి సంవత్సరం పూర్తి చేశాడని, ఆపై చదివించే స్థోమత లేదన్నారు.అయితే కాలేజి వారు ఆరేళ్ల ఫీజు మొత్తం చెల్లిస్తేనే సర్టిఫికెట్స్ ఇస్తామని చెబుతున్నారన్నారు. మొదటి సంవత్సరానికి రూ.1.20లక్షలు చెల్లించామని, మిగిలిన 5.40 లక్షలు చెల్లించాల్సిందేనని అంటున్నారన్నారు. ఆ డబ్బు చెల్లించే ఆర్థిక స్థితి మాకు లేదని ఆమె తెలిపారు. కావున కళాశాల నుండి కుమారుడి సర్టిఫికెట్స్ ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

వాచ్‌మెన్లకు రక్షణ కల్పించాలి

వాచ్‌మెన్లపై దాడులు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని బహుజన అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్/ఉమెన్ సంక్షేమ యూనియన్ నాయకులు స్పందనలో అర్జీ అందచేశారు. ఇటీవల గుంటూరు నగరంలో ఇద్దరు వాచ్‌మెన్ల హత్యలు చూసిన తర్వాత వాచ్‌మెన్‌గా విధులు నిర్వహించాలంటేనే భయంగా ఉందన్నారు. రాత్రి వేళ గస్తీ తిరిగే బీటు పోలీసుల ద్వారా అన్ని అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్లకు అనుసంధానం ఉండేలా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. హత్యకు గురైన వాచ్‌మెన్లకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో సిహెచ్.వాసు, మంగాదేవి, జేమ్స్ తదితరులున్నారు.

వినతి పత్రం అందజేస్తున్న నడింపాలెం గ్రామస్తులు

శ్మశాన స్థలాన్ని ఆక్రమించారు..

ప్రజాశక్తి- ప్రత్తిపాడు

స్మశానం స్థలం కళ్లం మోడరన్ రైస్ మిల్లు వారు, పక్కన పొలాల వారు అక్రమణలు చేశారని సోమవారం స్పందనలో నడింపాలెం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ప్రత్తిపాడు మండల పరిదిలోని నడింపాలెం ఎస్‌సి కాలనీలో గతంలో 40 కుటుంబాలు వుండేవని,ప్రస్తుతం 300 కుటుంబాలు నివసిసున్నాయన్నారు. గతంలో స్మశానం లేదని అధికారులకు తెలుపగా ఎమ్మెల్యే మాకినేని పెదరత్తయ్య ఆధ్వర్యంలో స్వశాన భూమిని కొలిచి, జన్మభూమి కార్యక్రమంలో షుమారు 4.70 సెంట్లు భూమిని కొలిచి, హద్దులు వేశారని తెలిపారు. అయితే గత 4,5 ఏళ్ల నుండి స్మశానం పక్కనే కళ్ళం మోడరన్ రైస్ మిల్లు , పక్కన ఉన్న పొలం వారు హద్దు రాళ్ళను పీకి, గందరగోళంగా స్మశానం భూమిని ఆక్రమించి ముందుకు వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులకు తెలిపిన ఎలాంటి స్పందన రాలేదని వాపోయారు. స్మశానం అభివృద్ధి కొసం రూ. 10 లక్షలు ప్రభుత్వం నుండి మంజూరైందని తెలిపారు. కాని ఆ స్థలం ఆక్రమణలో వున్నందున, ఆ డబ్బులు వినియోగించకుండా ఉన్నామని, త్వరతగతిని అధికారులు తమ సమస్యను పరిష్కరించి హద్దురాళ్ళను వేయించి,దాని చుట్టూ ఫెన్సింగ్ వేయించాలని గ్రామస్తులు కోరారు.

అసిస్టెంట్ కమిషనర్‌కువినతి పత్రం అందజేస్తున్న పి. వేణు

కుళాయిలు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - మంగళగిరి: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నవులూరు బాపనయ్య నగర్ ఇస్కాన్ టెంపుల్ సమీపంలో రెండు పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేయాలని న్యాయవాది పాలకాయల వేణు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతికి వినతి పత్రం అందజేశారు. 200 నివాస గృహాలు ఉండగా గత కొన్నేళ్లుగా ఒకే ఒక్క పబ్లిక్ కుళాయి ఉండటం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. గతంలో అనేక మార్లు పంచాయతీ అధికారులకు సమస్యపై ఏకరవు పెట్టినప్పటికీ పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్ పరిధిలోకి వెళ్లిన నేపథ్యంలో అక్కడి ప్రజల సమస్యను అర్థం చేసుకొని పబ్లిక్ కులాయిలను ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరారు.

స్పందనలో అర్జీ అందజేస్తున్న ముస్లిం పెద్దలు

ఆధ్యాత్మిక అవసరాలకు స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్ : సామాజిక, ఆధ్యాత్మిక అవసరాలకు స్థలం కేటాయించాలని సోమవారం మండల తహశీల్దార్ కార్యలయయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో గ్రామానికి చెందిన ముస్లిం పెద్దలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు సామాజిక, ఆధ్యాత్మిక, విద్య ఇతర అవసరాల కోసం గ్రామంలో ప్రత్యేక స్థలం కేటాయించాలని అన్నారు. గతంలో తమకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే కిలారి రోశయ్యకు అందజేసినట్లు పేర్కొన్నారు. దశాబ్దాలుగా గ్రామంలో జీవనం సాగిస్తున్న తమకు ఎటువంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని తమకు స్థలాన్ని కేటాయించి ముస్లిం మైనార్టీ వర్గాలకు సహకరించాలని గ్రామస్తుల అర్జీలో పేర్కొన్నారు. తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

జిఎంసి స్పందనకు 59 ఫిర్యాదులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల నుండి సమస్యలపై అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శుల పై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన నిర్వహించారు. పట్టణ ప్రణాళిక విభాగం 15, ఇంజినీరింగ్ విభాగం 18, ప్రజారోగ్య విభాగం 6, రెవెన్యూ విభాగం 9, ఉపాసెల్ విభాగం 3, అకౌంట్స్ విభాగం 6, పరిపాలన విభాగానికి 2 ఫిర్యాదులు మొత్తం 59 పిర్యాదులు అందాయని కమిషనర్ తెలిపారు.ఆయా అర్జీలను సంబంధిత అధికారులకు అందచేసి, సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ మూర్తి, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, సిఎంఓ హెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్‌ఓ. డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుండిమెడలో కరపత్రాలు పంచుతున్న జొన్న శివశంకరరావు

దావులూరులో కరపత్రాలు పంచుతున్న సాంబిరెడ్డి

పెదనందిపాడులో మాట్లాడుతున్న బి.శ్రీనివాసరావు

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

5న చలోఢిల్లీని జయప్రదం చేయాలని నాయకుల పిలుపు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కార్మికులు, కర్షకులు తలపెట్టిన ఏప్రిల్ 5 చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామంలో రైతు, కౌలు రైతు సంఘం నాయకులు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కరపత్రాలు పంచుతూ, విస్తృత ప్రచారం నిర్వహించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంపదంతా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకుందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు రైతులు కార్మికులు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కష్ణ, కెవిపియస్ నాయకులు జెట్టి రాంబాబు, సిఐటియు నాయకులు నల్లపు లెనిన్, తురక సాంబయ్య, పాల్గొన్నారు.

పెదనందిపాడు:కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలి అని సోమవారం కాకుమాను మండల కేంద్రంలో సిఐటియు, రైతు సంఘం, కౌలురైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు, ఈ సదస్సుకు కౌలు రైతు సంఘం నాయకులు దేవిరెడ్డి జయశంకర్ అధ్యక్షత వహించారు కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని, ప్రజల కొనుగోలు శక్తి సన్నగిల్లుతుందని తెలిపారు. దేశంలో 65 శాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు.దీనిని ప్రజలందరూ గమనించి బిజెపి విధానాలను ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సిఐటియు మండల కార్యదర్శి కందుల శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేల రూపాయలు చెల్లించాలని కోరారు. ఈ సమస్యల కొరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కొల్లా వెంకన్న, ఏ జ్యోతి, మమత, కిషోర్, ఆటో యూనియన్ సభ్యులు నాగరాజు పాల్గొన్నారు.**తెనాలి:**గ్యాస్ ధరల పెంచి సామాన్యులపై భారం మోపిన కేంద్ర ప్రభుత్వ వైఖరిని తిప్పికొట్టాలని ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి పిలుపునిచ్చారు. కొల్లిపర మండలం దావులూరులో ఆయన సోమవారం మహిళలతో మాట్లాడారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, గ్యాస్ ధర పెంపుపై వారు ఆవేదనవ్యక్తం చేశారు. ఈసందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్రలో బిజెపి అధికారంలోకి రాకముందు గృహావసరాలను ఉపయోగించే వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.440గా ఉందని, ఇప్పుడు అధి రూ.1160కి చేరిందన్నారు. కార్యక్రమంలో జిల్లాకమిటీ సభ్యులు ముద్దన సాంబశివరావు, కౌలు రైతు సంఘం నాయులకు జిలుగు ముక్కంటి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈ నెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పల్నాడు జిల్లాలో జరిగే బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు . కలెక్టరేట్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాల్ లో సోమవారం ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్ ను జిల్లా కలెక్టర్ ప్రకటించారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీ డియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి 30,530 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని అన్నారు. ఇంటర్మీడియట్ తొలి ఏడాది లో 14,008 మంది విద్యార్థులు, ద్వితీయ ఏడాదిలో 15,228 మంది విద్యార్థులు, ఒకేషనల్ విద్య ద్వారా ఇంటర్మీడియట్ తొలి ఏడాది లో 704 మంది, ద్వితీయ ఏడాదిలో 590 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని వివరించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు సంబంధించిన నిర్వహణ అధికారుల కమిటీ, వైద్యఆరోగ్య శాఖ అధికారులు, రవాణా, పోలీసు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా ప్రభుత్వ విధుల్లో పాల్గొని, ప్రశాంతంగా పరీక్షలు నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పరీక్షా కేంద్రాలు, విద్యార్థుల వివరాలు, ప్రయాణ సౌకర్యం, పోలీస్ స్టేషన్ లో ప్రశ్నాపత్రాలు భద్రపరిచే అంశాలు వంటి వాటి పై ఆయా శాఖలకు చెందిన అధికారులతో చర్చించి ఆదేశాలు జారీ చేశారు.

లబ్ధిదారుడికి నూతన వాహనం తాళాలు అందజేస్తున్న జెసి

'నవోదయంతో' ఉపాధి

గత ఏడాది నవంబర్ 14న వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం ద్వారా పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం, చోటపాపాయపాలెంకు చెందిన వంకుడువతు రాంబాబు నాయక్ ఉపాధి కోసం బొలెరో వాహనం కోసం దరఖాస్తు చేసుకున్నారు. పిడుగురాళ్లకు చెందిన స్టేట్ బ్యాంక్ ఇండియా నిర్వాహకులు ఈపథకం ద్వారా వాహనం కొనుగోలు చేసేందుకు రుణం మంజూరు చేశారు.

బ్యాంకు ద్వారా కొను గోలు చేసిన వాహనాన్ని కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్‌లో సోమవారం ప్రారంభించారు. నిరుద్యోగ యువత క్రమశిక్షణతో ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుని కారును జిల్లా కలెక్టర్ నడిపి యువతలో ఉత్సాహం నింపారు. నవోదయం కార్యక్రమం ద్వారా 45 శాతం

మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

సబ్సిడీ మంజూరు చేయ నున్నట్లు నవోదయ నోడల్ అధికారి సంజీవరావు తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబుల నాయుడు, పల్నాడు జిల్లా ఎల్.డి.ఎం వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖాధికారి బి.జె.బెన్ని, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి వరలక్ష్మి, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ అధికారి బాలు నాయక్, జిల్లా పరిశ్రమల శాఖాధికారి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

మర్రి రాజశేఖర్‌కు జియావుద్దీన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అంకితభావంతో పార్టీకి చేసిన సేవలకుగాను మర్రి రాజశేఖర్ కు ఎమ్మెల్సీగా తగిన గుర్తింపు లభించిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారు ఎస్.ఎం. జియాఉద్దీన్ అన్నారు. సోమవారం చిలకలూరిపేటలోని ఆయన స్వగృహంలో కలసి అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ అన్ని వర్గాలకు న్యాయం చేశారని, భవిష్యత్తులో పార్టీని మరింత బలపరిచేందుకు అందరు కలసి కృషి చేయాలని అన్నారు.

నాదెండ్లలో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-నాదెండ్ల

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రమైన నాదెండ్ల డిఆర్‌డిఎ కార్యాలయంలో సోమవారం మహిళా సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి తలతోటి రాణి, తహశీల్దార్ ఎవి రమణ, ఎంపిడిఒ షేక్ జాకీర్ హుస్సేన్ మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మహిళ సాధికారిక ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు మండల స్థాయి మహిళా కార్యదర్శులకు శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం మహిళలకు మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ మొదలగు ఆట పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు శ్రీనిధి శ్రీనివాసరావు, ఎపిఎం భరత్ కుమార్, ఎంఇఒ ఆంజనేయులు,సిడిపిఓ జడ్పిటిసి, డిఆర్‌డిఎ సిసిలు పాల్గొన్నారు.

ప్రపంచ దంత వైద్యుల దినోత్సవం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండలం మురికిపూడిలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ దంత వైద్యుల దినోత్సవం జరిగింది. ప్రముఖ దంత వైద్యులు డా.పేర్ని కష్ణ మోహన్ పాల్గొని విద్యార్థులకు దంతాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేవినేని శంకర్ రావు పాల్గొని మాట్లాడారు.

'వేధింపులకు గురిచేసిన వారిని వదలం'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

కోడెల శివప్రసాదరావును వేధింపులకు గురిచేసి ఆయన మరణానికి కారణమైన వారిని ఎవ్వరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని సత్తెనపల్లి నియోజకవర్గ తెలుగు యువత నాయకులు కోడెల శివరాం హెచ్చరించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పెదమక్కెన,గర్నెపూడి గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్, కోడెల విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం రాత్రి అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీనటుడు నారా రోహిత్, జీవి ఆంజ నేయులు నర్సరావుపేట ఇన్చార్జి చదలవాడ అరవిదబాబు ముఖ్యఅతిథులు హాజరయ్యారు.

ఆధార్ అనుసంధానానికి 31లోపు అవకాశం

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల నియోజకవర్గంలో ఓటుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ 75.03శాతం పూర్తి అయినట్లు గురజాల ఆర్.డి.ఓ అద్దెయ్య తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆర్.డి.ఓ అద్దెయ్య విలేకరులతో మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గ పరి ధిలో 2,53,953 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. వీరిలో 1,90, 552 మంది తమ ఓటుకు ఆధార్‌ను అనుసంధానం చేసుకున్నట్లు వివ రిం చారు. ఇప్పటికి 63,401మంది ఓటర్లు తమ ఓటుకు వారి ఆధా ర్‌ను అనుసంధానం చేసుకోలేదన్నారు. వీరికి ఎన్నికల కమిషన్ మార్చి 31వ తేదిలోపు అనుసంధానానికి అవకాశం ఇచ్చి నట్లు తెలిపారు. ఆధార్ అనుసంధానం కాని ఓటర్లు తమ బూత్ లెవల్ ఆఫీసర్, రూరల్ ప్రాంతంలో తహశీల్ధార్‌ని, అర్బన్‌లో మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఓటుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. ఆధార్ వివరాలు ఇవ్వని వారికి సంబంధించి వారి అభిప్రాయాలను నమోదు చేసి తదుపరి ఉత్తర్వుల కొరకు ఎన్నికల సంఘ అధికారులకు నివేదిస్తా మన్నారు.

గురజాల ఆర్.డి.ఓ అద్దెయ్య

'చౌకడిపోలను తనిఖీ చేస్తున్నాం'

గురజాల ఆర్.డి.ఓ అద్దెయ్య ఆధ్వర్యంలో మాచర్ల పట్టణం లోని చౌకడిపోలన్నింటిని సోమవారం రెవిన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. చౌకడిపోలపై వస్తున్న ఫిర్యాదుల నేపధ్యంలో గురజాల డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, డిప్యూటి తహశీల్ధార్లు ఇతర సిబ్బంది 10 టీమ్స్‌గా ఏర్పడి పట్టణంలోని 30 చౌక డిపోలను తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో వ్యత్యసాలు బయటపడితే చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ తెలిపారు.

పన్నులు చెల్లించకుంటే ఆస్తుల జప్తు : కమిషనర్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో పురపాలక సంఘానికి సం బంధించిన ఆస్తి పన్నులు,నీటి ఛార్జీలు,ఖాళీ స్థలాల పన్నులు ఈ నెలా ఖరులోపు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ గోవిందరావు కోరారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పట్టణంలో ఆస్తి పన్నులు రూ.3 కోట్లు, నీటి ఛార్జీల పన్నులు సుమారు రూ.కోటి వరకు వసూలు కావాల్సి ఉందన్నారు. దీనికి సంబంధించి డీఈ, ఇద్దరు ఏఈలు, ఇద్దరు ఆర్ఐలు, 29మంది వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, మరో 29 ఎమినిటీ సెక్రటీలకు బాధ్యతలు అప్పగించామని, రెండూ మూడ్రోజుల్లో తానూ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తానని తెలిపారు. పన్నులు చెల్లించకుంటే తాగునీటి పైపు కనెక్షన్ తొలగిస్తామరని, ఆస్తులను జప్తు చేస్తామని అన్నారు. ఈ నెల 25 లోపు ఆన్‌లైన్ ద్వారా లేదా మునిసిపాలిటీ కౌంటర్ లేదా వార్డు సచివాలయ అడ్మిన్‌ల ద్వారా పన్నులు చెల్లించాలని సూచించారు. సెలవుల్లోనూ మన్సిపల్ కార్యాలయంలో పన్ను వసూలు కేంద్రాలు తెరిచే ఉంటాయన్నారు.

ఎంఎఎం ఫార్మసీ కళాశాల విద్యార్థుల అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-నరసరావుపేట

మండలంలోని కేసనపల్లిలో గ్రామ పరిధిలోని ఎంఎఎం ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. నార్కోటిక్స్, సైకోట్రోపిక్ డ్రగ్స్ దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఈ ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ మహాదేవ లాల్ స్క్రాఫ్ చేసిన సేవ లను గౌరవించే నిమిత్తం ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మార్చి 6న అధికారికంగా 'జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవం'గా గుర్తించిందని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం ప్రసాదరావు అన్నారు.ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఇలాంటి అవగాహన ర్యాలీలు ప్రజలకు ఎంతో దోహదపడతాయన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పి లక్ష్మణరావు, జె నాగరాజా, కార్తీక్ చేగు, వాలంటీర్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు యువత నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట రూరల్ మండల నూతన తెలుగు యువ త కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. రూరల్ మండల నూతన తెలుగు యువత అధ్యక్షుడు తూబాటి హరీష్, ఉపాధ్యక్షులుగా సాతులూరి రామకృష్ణ, మంద శివకోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా రావువారి అజయ్ కుమార్, కార్యని ర్వాహక కార్యదర్శులుగా షేక్ బషీర్, కట్టా శ్రీనివాసరావు, చాపల మడుగు వెంకటేష్, కార్యదర్శులుగా సూరబోయిన వాసు, యంపరాల గోపి, కొమిటినేని రవి కిషోర్ లను ఎన్నుకున్నారు. కార్యవర్గంలో తమకు అవకాశం కల్పించిన టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావుకు, రూరల్ మండల అధ్య క్షులు జవ్వాజి మదన్ మోహన్‌కు వారు ధన్యవాదాలు తెలియజేశారు.

ఏడాదంతా భూమిపై ఏదోఒక పంట ఉండాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ప్రకృతి వ్యవసాయం రైతులు దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర కో-ఆర్డినేటర్ వెంకట్రావు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమల కుమారి రైతులను కోరారు. మండలంలోని భృగుబండలో వీరు సోమవారం పర్యటించి రైతులకు సదస్సు నిర్వహించారు. గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో 5 లేయర్ మోడల్ సాగు చేస్తున్న తోటలను పరిశీలించారు అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఇంచార్జి ఎడిఎ శ్రీధర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు జీవనజ్యోతి, సత్తెనపల్లి డివిజన్ మాస్టర్ ట్రైనర్ నందకుమార్, బగుబండ యూనిట్ ఇన్‌ఛార్జి శైలజ, రజిని, నిర్మాల రాణి, రైతులు పాల్గొన్నారు

కుల జన గణన పట్ల వివక్ష తగదు

ప్రజాశక్తి-ఈపూరు

కుల జన గణన పట్ల రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు వివక్ష తగదని భారతీయ బహుజన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సంపతి వెంకట్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ బహుజన పార్టీ ఆధ్వర్యంలో బహుజన రాజ్య పాదయాత్ర చేపట్టినట్లు దానిలో భాగంగానే సోమవారం పాదయాత్ర (115 కి.మీ) మండల కేంద్రం ఈపూరుకు చేరిందన్నారు. ప్రైవేటు రంగాలలోనూ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు.కులాల జనాభా లెక్కలు తీసి నేటికీ 92 సంవత్సరాలు అయినదని కుల జనాభా నిష్పత్తి లేకుండా ప్రాతినిధ్యం ఎలా కల్పిస్తారని అన్నారు.దేశంలో బీసీల జనాభా సగానికి పైగా ఉన్నారని ఎస్సీ,ఎస్టీ మైనార్టీ,ఓసీల జనాభాను లెక్కించి సామాజికంగా, ఆర్థికంగా,రాజకీయంగా చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలని ఆయన కోరారు.

వీధి కుక్కల నియంత్రణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలకు వీధికుక్కల వలన సమస్యలు తలెత్తకుండా నగర పాలక సంస్థ పటిష్ట చర్యలు తీసుకోనున్నదని, వారం రోజుల్లో నగరంలోని వీధి కుక్కలకు మాస్ యాంటి ర్యాబీస్ వ్యాక్సినేషన్ చేయనున్నామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు. సోమవారం మేయర్ ఛాంబర్లో నగర కమీషనర్ కీర్తి చేకూరి, పశు సమర్ధక శాఖ అధికారులు, జిఎంసి ప్రజారోగ్యాధికారులు, జంతు ప్రేమికులతో కలిసి వీధి కుక్కల నియంత్రణ, ర్యాబీస్ వ్యాక్సినేషన్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో వీధి కుక్కల వలన ప్రజల నుండి అనేక పిర్యాదులు అందుతున్నాయని, త్వరలో ఈ సమస్య పరిష్కారమయ్యేలా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. వ్యాక్సినేషన్‌తో పాటు, ఏబిసి కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జంతు ప్రేమికులు కూడా సహకరించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సుమారు 20 వేలకు పైగా ఉన్న వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయటానికి ఇద్దరు పశు వైద్యులను కేటాయించాలని పశు సంవర్ధక శాఖకు లేఖ రాశామని, త్వరలో వైద్యులను కేటాయిస్తారన్నారు. ఆపరేషన్ల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, మౌలిక వసతుల కల్పన ఇప్పటికే సిద్ధం చేశామన్నారు. సచివాలయాల వారీగా శానిటేషన్ కార్యదర్శుల ద్వారా ప్రతి వీధిలో కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స, యాంటి ర్యాబీస్ వ్యాక్సినేషన్ చేయించేలా యాక్షన్ ప్లాన్ తయారు చేస్తున్నామన్నారు. సమావేశంలో యంహెచ్ఓ భాను ప్రకాష్, యస్‌యస్‌లు రాంబాబు, ఆనంద్ కుమార్, పశుసంవర్ధక శాఖ అధికారులు, జంతు ప్రేమికులు సురేష్ కుమర్ జైన్, ప్రదీప్ కుమార్, సురేష్ జాగు, తేజోవంత్, నరసింహారావు, రామరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు

రథోత్సవ భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ పరిశీలన

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం జరిగే రథోత్సవ సందర్భంగా భద్రత ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఆరిఫ్ ఆఫీజ్ సోమవారం పోలీస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సోమవారం రాత్రి జరిగే కళ్యాణోత్సవానికి, మంగళవారం జరిగే రథోత్సవంకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణవేధికా దిగువ సన్నిధి రథోత్సవ మార్గంను గుడి వద్ద నుండి మిద్ది సెంటర్ వరకు ఈఓ. రామకోటి రెడ్డి, అడిషనల్ ఎస్‌పి.అనిల్ సిబ్బందితో కలిసి నడుచుకుంటు వచ్చి పలు కూడళ్ల వద్ద భద్రత చర్యల నడుమ సిబ్బందికి పలు సూచనలు చేశారు. డి.ఎస్. పి,రాంబాబు,పట్టణ సి.ఐ.అంకమ్మరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

15 నుండి వర్సిటీలో అకడమిక్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లో ఈనెల 15 నుండి 17 వరకు మూడు రోజులపాటు విద్యా విషయక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వర్సిటీ విసి పి.రాజశేఖర్ తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సోమవారం గోడ ప్రతులను ఉపకులపతి ఆయన ఆవిష్కరించారు. ఈ విద్యా విషయక ప్రదర్శన కార్యక్రమానికి విశ్వవిద్యాలయ సిడిసి డీన్ ఆచార్య కె.మధుబాబు కార్య నిర్వాహక కార్యదర్శిగా వ్యవహరించనున్నారు . కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య పి. వర ప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఆచార్య సిద్ధయ్య, శ్రీమతి సరస్వతి రాజు అయ్యర్, డా. జీ.అనిత తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ వ్యాయమంతో ఆరోగ్యం మెరుగు

ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్, డిఎంఅండ్‌హెచ్ఓ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

సైకిల్ వ్యాయామంతో ఆరోగ్యం మెరుగుపడుతుందని, కేన్సర్ వ్యాధిని సైతం నియంత్రించవచ్చుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎ. శ్రావణ్‌బాబు అన్నారు. సోమవారం ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో సైకిల్ ఫర్ హెల్త్ పేరుతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని స్థానిక కార్పొరేటర్ ఎ.పద్మావతి ప్రారంభించారు. అనంతరం షేక్.నబీష అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు మాట్లాడుతూ అధిక బరువు, రక్తపోటు, మానసిక ఒత్తిడిని అదిగమించి, మంచి నిద్ర, ఆనందం ఉల్లాసం పొందవచ్చున్నారు. అమెరికా దేశంలో 4వేల మంది కేన్సర్ రోగులపై సైకిల్ వ్యాయామం చేపట్టారని, పది ఏళ్ల అధ్యయనం తర్వాత వ్యాధి, మరణాలు 46శాతం నుండి 50 శాతానికి తగ్గినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది, పట్టణ వైద్యాధికారి డాక్టర్ షేక్.హమీద, జిల్లా మాస్ మీడియా అధికారి ఎ.జయప్రసాద్ పాల్గొన్నారు.

ఫిజిక్స్, క్రెమిస్ట్రీ సబ్జెక్టులపై అవగాహన

ప్రజాశక్తి-మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లో అవగాహన, వాటి ప్రాముఖ్యంపై అవగాహన పెంపొందించటానికి ఈ అవగాహన కార్యక్రమాలు దోహద పడతాయని, సౌత్ జోన్ అసోసియేషన్ ఆఫ్ కెమిస్ట్రీ టీచర్స్, సెక్రెటరీ డాక్టర్ మన్నం కృష్ణమూర్తి అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్,ఇండియన్ అససియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్, కొండముడి రవీంద్రా కుమార్ ,ఫౌండర్, ట్రస్టీ , కోనేరు చరిటీబుల్ ట్రస్ట్ కోనేరు వాసుదేవరావు, శివారెడ్డి రిటైర్డ్ ఇంజనీర్‌లు పాల్గొని విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. భవిష్యత్తులో చదువులో రాణించాలని ఆకాంక్షించారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ జయకుమార్ ,ప్రిన్సిపల్ అశోక రాణి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల ప్రశ్నలను నివృత్తి చేస్తున్న కెమికల్ ఇంజనీర్

పిడి థామస్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

సెయింట్ థామస్ స్కూల్ 18వ వార్షికోత్సవం

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

విద్యార్థుల విద్యా వికాసానికి ఉపాధ్యాయులు కృషి అభినందనీయమని ప్రముఖ సినీ నటుడు సెబాస్టీన్ అన్నారు. ఆదివారం రాత్రి సెయింట్ థామస్ పాఠశాల 18వ వార్షికోత్సవం , పాఠశాల డైరెక్టర్ పిడి దామస్ పుట్టినరోజును పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాల విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు మరింత సహకారం అందించాలని, 18 వసంతాలలో ఎందరో విద్యార్థులను ఉత్తమ విద్యావంతులుగా తయారుచేసిన పాఠశాల డైరెక్టర్ పిడి థామస్ అభినందనీయులని పేర్కొన్నారు. ముందుగా పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రధానం చేశారు. విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక లఘునాటిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. పాఠశాల డైరెక్టర్ పిడి థామస్, రోజ్ థామస్‌లను పుష్పగుచ్చాలు దశ్యాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పర్యావరణ సమన్యాయమే సామాజిక న్యాయం

ప్రజాశక్తి -ఎఎన్‌యు

పర్యావరణ సమన్యాయంతోనే సామాజిక న్యాయం సాధ్యపడుతుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య రాజశేఖర్ పట్టేటి తెలిపారు. వర్సిటీలోని పర్యావరణ విద్య విజ్ఞాన విభాగం వారు సామజిక ,పర్యావరణ అంశాలలో సుస్థిర అభివృద్ధి పై నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరులు అన్నిటిని ఎక్కువుగా ఉపయోగించుకోవటం ద్వారానే అభివృద్ధిని సాధించవచ్చని, ఈ అభివృద్ధి మానవ జీవన ప్రమాణాలపై దుష్ప్రభావాలు లేకుండా చేయడం వలన సుస్థిర అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. అభివృద్ధి చెందిన సాంకేతికతతో వనరుల వినియోగం గరిష్ఠంగా పెంచడం ద్వారా అభివృద్ధి చెందిన , చెందుతున్న దేశాల మధ్య పర్యావరణ సమన్యాయం చేయవచ్చని ఈ దిశగా సదస్సులో పాల్గొని పరిశోధకులు చర్చించాలని తెలియజేసారు. సదస్సు అధ్యక్షులు ఆచార్య బ్రహ్మజీ రావు మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పర్యావరణంలో వచ్చే మార్పులను ముందుగా తెలుసుకుని మానవాళి ఆరోగ్యం పై దుష్ప్రభావాలు చూపకుండా అప్రమత్తం చేయడానికి పర్యావరణ శాస్త్ర రంగంలో జరుగుతున్న పరిశోధనలు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ప్రయోజనకరమని తెలిపారు. కళాశాల ప్రచార్యులు కె.గంగాధర్ మాట్లాడుతూ కార్బన్డైఆక్సైడ్, ఓజోన్ పొర మొదలైన పర్యావరణ సమస్యలపై యువ శాస్త్రవేత్తలందరూ ప్రణాళికా బద్దంగా చర్చించాలని కోరారు. డా ఎ.వి.వి.ఎస్. స్వామి కార్యనిర్వాహక కార్యదర్శిగా వ్యవహరించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, కీలకోపన్యాస కర్తగా హైదరాబాద్ విశ్వవిద్యాలయం కు చెందిన ఆచార్య పురేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వీసీ పట్టేటి రాజశేఖర్

ఆంజనేయులును సత్కరిస్తున్న థియేటర్ కమిటి బృందం

పౌరాణిక కళాకారుడు ఆంజనేయులుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఎన్టీఆర్ నటించిన ఆడబ్రతుకు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. కళాకారుల సత్కారాల్లో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ పౌరాణిక కళాకారుడు ముతకని ఆంజనేయులును థియేటర్ కమిటీ సభ్యులు మద్ది మల్లిఖార్జునరావు, పిట్టు విజయ్ రెడ్డి, అప్పల కిషోర్, తిన్నలూరి కొండయ్య, బొంతా వీరాంజనేయులు, సత్కరించారు. పి. పోతురాజు, డాక్టర్ ఎ. మల్లేశ్వరరావు, ఎస్.సాంబశివరావు, ఎం.రాఘవరావు, జి.ప్రసాద్,కె.ఉపేంద్ర, ఎం.వెంకట్,ఎన్.రంగారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మునగాల మల్లేశ్వరరావు

వ్యాపార, పారిశ్రామిక అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి -మంగళగిరి

రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి వేగవంతం అవుతుందని వైసిపి గుంటూరు జిల్లా చేనేత భాగం అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు అన్నారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో విశాఖపట్నం గ్లోబల్ ఇన్వెస్టర్ సబ్మిట్ విజయవంతమైన సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.13 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు రావడం వలన 6 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. సంక్షేమంతో పాటు పారిశ్రామిక రంగంలో కూడా అబివృద్ధి సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో పట్టణ వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలు సంకె సునీత, వైసిపి నాయకులు సంక బాలాజీ గుప్తా, ఎం సుధారాణి, ఎండి ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్

ఈనెల 7వ తేదీ నుంచి 13 వతేది వరకూ గ్రామీణ మహిళల కోసం ఏపీ ఎస్ఆర్ఎం, మంగళగిరి ఎయిమ్స్, కల్పాకంలోని ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ ఆటమిక్ రీసెర్చ్ (ఐజీకార్)లు సంయుక్తంగా ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరాలను నిర్వహించనున్నట్లు సోమవారం ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు వెల్లడించారు. మంగళవారం మధ్యాహ్నం జరిగే అంతర్జాతియ మహిళా వారోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజయవాడ క్రైమ్స్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ పి. వెంకటరత్నం, ఐజీకార్ రామ్స్ హెడ్ మేనకలు హాజరవుతారని తెలిపారు. ఈ నెల 8న కురగల్లు హైస్కూల్ ఆవరణలో 9న నీరుకొండ శివాలయం దగ్గర, 10న వర్సిటీ ఆవరణలో, 11వ తేదీన నిడమర్రు అర్బన్‌లోనూ ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నాయన్నారు. హెల్త్ సెంటర్ బ్రెస్ట్ కేన్సర్, గొంతు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో పాటు ఈసీజీ, బీపీ, బ్లడ్ షుగర్ పరీక్షలను ఉచితంగా అందిస్తారని తెలిపారు. 13న యూనివర్సిటీలో జరిగే ముగింపు వేడుకలకు రాష్ట్ర యూత్ సర్వీసెస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ జీ వాణీమోహన్, ఐజీకార్ ప్లానింగ్ హెడ్ డాక్టర్ విద్యులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు.ప్రజలు సద్వినియోగం చేసుకోవానలి వారు కోరారు.

విజయవాడ సిఆర్‌డిఎ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అసైన్డ్ రైతులు, సిపిఎం నాయకులు

అసైన్డ్ రైతుల ఆకలి కేకలు వినరా?

విజయవాడ సిఆర్‌డిఎ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతంలో దళితులు, పేదలైన అసైన్డ్ రైతుల ఆకలి కేకలు ప్రభుత్వానికి వినబడడం లేదా? అని సిపిఎం నాయకులు, మెట్ట అసైన్డ్ రైతులు ప్రశ్నించారు. కౌలు చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ విజయవాడలోని సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. అధికారులకు ఇప్పటికే నాలుగుసార్లు వినతిపత్రాలిచ్చినా కౌలు సొమ్ము జమ చేయలేదని, వివాదాలు లేని అసైన్డ్ భూములకు కౌలు చెల్లింపునకు ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. గతేడాది జూన్‌లో చెల్లించాల్సిన కౌలు సొమ్ము ఇప్పటి వరకు చెల్లించక పోవడం దారుణమన్నారు. రాజధానిలో వ్యవసాయ పనులు లేవని, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పించలేదని, దీంతో కుటుంబాలు గడవక అసైన్డ్ రైతులైన దళితులు,పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వం సత్వరమే స్పందించకుంటే సిఆర్‌డిఏ కార్యాలయం వద్ద దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసైన్డ్ రైతులు జె.ఏడుకొండలు, పి.బాబూరావు, భాస్కరరావు, ఎన్.వీరయ్య, కె.సుబ్బారావు, కె.ఏడుకొండలు, బి.వెనర్జి, కె.నాగేంద్రం, ఎ.సువర్ణకమల పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో విధులకు ఉపాధ్యాయులు

- పల్నాడు డిఇఒ వెంకటప్పయ్యను బదిలీ చేయాలని డిమాండ్
- చర్యలు తీసుకోకుంటే 14న కలెక్టరేట్ ఎదుట ధర్నా : ఫ్యాప్టో

ప్రజాశక్తి - నరసరావుపేట

ఉపాధ్యాయులపై పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటప్పయ్య అనుచిత వ్యాఖ్యలను ఉపాధ్యాయులు తీవ్రంగా నిరసించారు. ఈ మేరకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లాలోని పలు పాఠశాలల్లో సోమవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవడంతోపాటు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఫ్యాప్టో పల్నాడు జిల్లా చైర్మన్ బి.సంపత్, జనరల్ సెక్రెటరీ వి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల అగౌరవంగా, అవమానకరంగా వ్యవహరిస్తున్న డిఇఒను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. డిఇఒ తన వ్యాఖ్యలతో ఉపాధ్యాయులు మానసిక ఆందోళనతో పాటు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. ఫ్యాప్టో నాయకులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి మాట్లాడుతూ వ్యక్తిగత దూషణలకు సైతం పాల్పడుతున్న డిఇఒ వెంకటప్పయ్యతో కలిసి ఉపాధ్యాయులు పనిచేయడం కుదరదని, ఆయన్ను బదిలీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు సుద్దులు చెప్పే ఆయన ముందు తన కార్యాలయంలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని అన్నారు. డిఇఒ తక్షణమే ఉపాధ్యాయులకు క్షమాపణలు చెప్పాలని, ఆయనపై చర్యలు తీసుకోకుంటే 14న కలెక్టరేట్ వద్ద నిరసన చేపడతామని ప్రకటించారు. ఈ మేరకు నరసరావుపేట మండలంలోని శంకరభారతీపురం పాఠశాల, ఈపూరు మండలం కొండ్రముంట్ల జెడ్‌పి పాఠశాల, దాచేపల్లి తదితర చోట్ల నిరసనలు తెలపగా నాయకులు యు.చంద్రజిత్తు, టి.చంద్రయ్య, ఎంఎం సుభాని, జి.రంగాచార్యులు, బి.వాసుబాబు, అగస్టిన్‌బాబు, నాగేశ్వరరావు, కొండలరావు, నరసింహారావు, ఆనందరావు పాల్గొన్నారు.

ఈపూరు మండలం కొండ్రముంట్ల, దాచేపల్లిలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పేదల కోసం క్లాత్ బ్యాంక్

ప్రారంభించిన మేయర్, కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

క్లాత్ బ్యాంక్‌లు నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉండటమే కాకుండా, నగర పరిశుభ్రతకు దోహదపడుతాయని మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అన్నారు. జిఎంసి ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీపురం ఈ-బస్‌బే వద్ద ఏర్పాటు చేసిన క్లాత్ బ్యాంకును కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి మేయర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు వినియోగించిన వస్త్రాలను ఈ క్లాత్ బ్యాంకుల్లో అందిస్తే వాటిని పేదలు తీసుకుని ఉపయోగించుకుంటారని చెప్పారు. ప్రజలు వాడని వస్త్రాలను బయటపడవేయకుండా ఈ బ్యాంకుల్లో అందచేయటం వల్ల పారిశుధ్య పరంగానూ ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ బ్యాంకులో వస్త్రాలను అందజేసేముందు వారి వివరాలను సేకరిస్తామని, వస్త్రాలను తీసుకొనే వారి వివరాలను కూడా సేకరించి రిజిస్టర్‌లో నమోదు చేస్తామని చెప్పారు. ఈ క్లాత్ బ్యాంకులో ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు జిఎంసి సిబ్బంది అందుబాటులో ఉంటారని, వస్త్రాలు ఇచ్చేవారు సిబ్బందికి అందించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ క్లాత్‌బ్యాంకు ఏర్పాటు వినూత్నమైన ఆలోచన అని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ, ఇఇ సుందరరామిరెడ్డి, ఎంహెచ్ఒ భానుప్రకాష్, ఎడిహెచ్ రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

క్లాత్ బ్యాంక్‌ను ప్రారంభించిన అనంతరం మేయర్, కమిషనర్ తదితరులు

నీటి కాల్వా...? తూటాకు కాల్వా...?

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

సాగు, తాగునీరు అందించే గుంటూరు ఛానల్‌లో తూటి ఆకు దట్టంగా పేరుకుపో యిందని, ఇది అధికారులు నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎపి రైతుసంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు విమర్శించారు. కొలనుకొండ వద్ద గుంటూరు ఛానల్‌ను సంఘం నాయకులు సోమవారం పరిశీలించారు. శివశంకరరావు మాట్లాడుతూ తాడేపల్లి మండలం ఉండవల్లి నుండి పెదనందిపాడు వరకు సాగు, తాగు నీరు అందిస్తున్న గుంటూరు ఛానల్‌కు ఈ దుస్థితి తగదని, వెంటనే శుభ్రం చేయించి నీరు సరిగా పారుదలయ్యేలా, పొలాలకు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. పరిశీలనలో సంఘం మండల కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, నాయకులు బి.శివారెడ్డి, డి.వెంకటరెడ్డి, కె.శివనారాయణ పాల్గొన్నారు.

కొలనుకొండ వద్ద కాల్వను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

అధిక దిగుబడి, అదనపు ఆదాయం!

కెఎల్‌యు ప్రొఫెసర్ ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయం, ఉత్పత్తుల తయారీ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఉత్పత్తులను చూపుతున్న డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, మహిళలు

కెఎల్ విశ్వవిద్యాలయ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం ప్రధాన పరిశోధనలో భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగ ప్రాజెక్ట్ ద్వారా పండించిన మిర్చి పంట యొక్క విలువ ఆధారిత ఉత్పత్తులను వర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ జగన్నాథరావు సోమవారం ఆవిష్కరించారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం గుత్తికొండకు చెందిన స్వయం సహాయక బృంద మహిళలు తయారు చేసిన మిర్చిపొడిని ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేశారు. అనంతరం డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్, ఐఒటి, మొబైల్ యాప్‌లు వాడడం ద్వారా 25 శాతం అధిక దిగుబడిని రైతులు సాధించారని, ఈ పంటతో మహిళలు విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి అదనపు ఆదాయం పొందుతున్నారని చెప్పారు. వీరికి గ్రైండింగ్ మిషన్లు, తూకాలు, కవర్లు, సీలింగ్ మెషీన్లు ఇచ్చామని, వీరు తయారు చేసే మిర్చి పొడికి లైసెన్స్ ఉందని, వీటిని రానున్న రోజుల్లో ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పరిశోధన విభాగ డీన్ డాక్టర్ జయకుమా రసింగ్, ప్రాజెక్ట్ సహాయకులు డాక్టర్ నాగమ ల్లేశ్వరి, డాక్టర్ రాధికారాణి, జెఆర్ఎఫ్ వైశాలి, స్వయం సహాయక బృంద సభ్యులు రేణుకాదేవి, మంగమ్మ, సావిత్రి, లక్ష్మి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్ఐసి ఎదుట కాంగ్రెస్ ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అదానీ వ్యవహారంలో దేశ ప్రజలకు ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అరండల్‌పేటలోని ఎల్ఐసి కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ ప్రజలు ఎంతో నమ్మకంతో పొదుపు చేసుకుంటున్న ఎల్ఐసిలోని సొమ్మును కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి చేసి అదానీ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టించిందని మండిపడ్డారు. నిరసనలో ఎపిసిసి కార్యదర్శి ఉషారాణి, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి, జిల్లా అధ్యక్షులు లింగం శెట్టి ఈశ్వరరావు, నగర అధ్యక్షులు ఉస్మాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందిగంలో కాశీనగర్ 1947 చిత్రీకరణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

శ్రీగణేష్ దేవి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రాయ దుర్గం రమాదేవిరెడ్డి నిర్మిస్తున్న 'కాశీ నగర్ 1947' సినిమాను మండలంలోని నందిగంలో సోమవారం చిత్రీకరించారు. నటులు జెన్నిపై చావిడి వద్ద కొన్ని సన్నివేశాలను, నరిశెట్టి బాల శౌరయ్య ఆధ్వర్యంలో కంచర్ల శ్రీధర్ ఇంట్లో కెవిఎల్ నరసింహారావు, దిలీప్ రాథోడ్, ఆరోహి గడిగె (అనురాధ), రాయదుర్గం రమాదేవిరెడ్డిలపై కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. వల్లెం చెన్నకేశవ నాయుడు ప్రతి నాయకుడి పాత్రలో జగన్నాథ పట్నాయక్‌గా నటిస్తున్నారు. సత్తెనపల్లికి చెందిన మద్దు రత్నరాజు, షేక్ సుభాని, జొన్నలగడ్డ రత్నరాజు వివిధ పాత్రల్లో నటిస్తున్నారని, మూగ రాముడుగా దుల్ల రాము, తహశీల్దారుగా గుంటూరు మెగా మూవీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ఎస్ నాయుడు, లక్ష్మి, అహ్మద్ నటిస్తున్నారు. ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్‌ప్లే దర్శకత్వం చిత్తజల్లు ప్రసాద్ బిఎ కాగా రాయదుర్గం రమాదేవి నిర్మిస్తున్నారు. కెమెరామెన్‌గా జి.కృష్ణ నాయుడు, దేవకి మురళీకృష్ణ వ్యవహరిస్తున్నారు. లక్ష్మణ సాయి సంగీతాన్ని సమకూరుస్తుండగా జి.సీతారామ చౌదరి, ఎల్ఐసి రఘుబాబు పాటలు రాస్తున్నారు. ఫైట్స్ హుస్సేన్‌భాయ్, కొరియోగ్రాఫర్ బండ్ల రామారావు వ్యవహరిస్తున్నారు.